జిల్లాలో మోస్తరు వర్షం

మంచిర్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం మధ్యాహ్నం అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో గాలి దుమారం రావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండగా మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన గాలి దుమారంతో వర్షం కురిసింది. తీవ్రమైన గాలుల కారణంగా అధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

ఓటింగ్ పెంచడమే లక్ష్యం

- గ్రామాల బాట పడుతున్న అధికారులు
- ఓటు వేసేలా ప్రజలకు అవగాహన





సింగరేణి కార్మికులతో ఓటు వేస్తామని చెప్పిస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

మంచిర్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఓటు హక్కు కలిగిన వారిని అందుకు సన్నద్ధం చేయడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలతో పోల్చితే పార్లమెంట్ ఎలక్షన్‌లో కొంతమేర పోలింగ్ శాతం తగ్గడం సహజం. అయితే ఆ పరిస్థితికి వ్యతిరేకంగా ఓటర్లు స్పందించేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. కళాజాత బృందాలతో కలిసి ఉన్నతాధికారులు స్వయంగా గ్రామాలు సందర్శిస్తూ అక్కడి ప్రజలను కార్యోన్ముఖులను చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

సమావేశాలు ఏర్పాటు చేయడం ద్వారా

లోక్‌సభ ఎన్నికల్లో 100 శాతం పోలింగ్ నమోదు చేసేందుకు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ సూచనల మేరకు వివిధ శాఖల ఉన్నతాధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు పరుస్తున్నారు. ఎలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న స్వీప్(సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాల్లో భాగంగా పోలింగ్ శాతం తక్కువ నమోదయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేలా కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. అలాగే ప్రధాన కూడళ్ళ వద్ద ఈనెల 13న ఓటు వేయాలని హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సింగరేణి కార్మికులు ఓటు హక్కు వినియోగించాలని అవగాహన కల్పిస్తున్నారు. బీఎల్‌వోలు పోలింగ్ స్లిప్‌లను అందజేస్తున్నారు.

72 గంటలు అప్రమత్తంగా ఉండాలి

- 11వ తేదీ నుంచి 144 సెక్షన్ అమలు
- మూడు రోజులపాటు వైన్ షాపుల మూసివేత
- సమీక్ష సమావేశంలో కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, మే 9: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఈ నెల 13న జరగనున్న పోలింగ్‌కు ముందు 72 గంటలు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ అశోక్‌కుమార్, అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి ఇంటెలిజెన్స్ కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు 72 గంటల క్లిష్ట సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఎన్నికల ప్రభావిత అంశాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. చెన్నూరు, మంచిర్యాల, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి జిల్లాలోని వైన్‌షాపులను మూసి ఉంచాలని ఆబ్కారీ మద్య నిషేధ శాఖ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఓటర్లకు నగదు పంపిణీపై సమాచారం అందిన వెంటనే జీఎస్టీ అధికారులు సంబంధిత ప్రాంతానికి చేరుకుని వివరాలు పరిశీలించి సరైన ఆధారాలు లేకపోతే జప్తు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద రక్షణ దళాలతో బందోబస్తు నిర్వహించాలని, ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. బ్యాంకు ఖాతాల్లో లక్ష రూపాయలకు మించి జరిగే లావాదేవీలను పరిశీలించాలని, ఏమైనా అనుమానం తలెత్తితే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. జిల్లా ఆబ్కారీ మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ తిరుపతి, కమర్షియల్ టాక్స్ అధికారి శివప్రసాద్, కేంద్రీయ జీఎస్టీ అధికారి శుభంకర్ సర్కార్, ఆదాయ పన్ను శాఖ అధికారి సూర్య భగవాన్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్, సంజయ్‌కుమార్, హన్మంతరెడ్డి, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారానికి వాన గండం



కాసిపేట, మే 9: ఎన్నికల ప్రచారానికి వానగండం ముప్పు పొంచి ఉంది. మూడు రోజుల క్రితం భానుడి ప్రతాపానికి ఎండ, వేడి ఉక్కపోతకు రాజకీయ నాయకులు ప్రచారాల టైంటేబుల్ మార్చుకుని ఉదయం, సాయంత్రం ప్రచారం చేశారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో భానుడు శాంతించారు. మిగిలి ఉన్న మూడు రోజుల ప్రచారాన్ని అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని చూస్తుండగా వాతావరణ శాఖ మరో ఐదు రోజులు వానలు పడే అవకాశాలు న్నాయని హెచ్చరించిన నేపథ్యంలో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.


ఎన్నికల వేళ విసుగెత్తిస్తున్న టెలీ కాలర్స్..



దండేపల్లి, మే 9 :పార్లమెంట్ ఎన్నికల వేళ టెలీ కాలర్స్‌తో విసుగెత్తిపోతున్నామని ఓటర్లు వాపోతున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేప థ్యంలో ఎన్నికల ప్రచారం మాటేమో కాని సమయం సందర్భం లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు ఫోన్ కాల్స్ వస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని అంటున్నారు. కొన్ని సమయాల్లో ఎవరికి ఓటు వేస్తున్నారు? మా పార్టీకి ఓటు వేయండని కూడా టెలీకాలర్స్ తెలియజేస్తున్నారు. సంబంధిత పార్టీ కాని వారికి మరొక పార్టీకి చెందిన ఫోన్‌కాల్స్ వస్తుండడంతో ఒక దశలో టెలీకాలర్స్‌పై ఓటర్లు చిర్రెత్తిపోతున్నారు

ఓటరు ఐడికి 28 ఏళ్లు...

మొదటిసారిగా 1995లో కార్డుల జారీ..



దండేపల్లి: దేశంలో ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజ్యాంగం ఎన్నికల కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించింది. కేంద్ర ఎన్నికల కమిషన్ అనేక సంస్కరణలు ప్రవేశపెట్టింది. అందులో దొంగ ఓట్లను అరికట్టేందుకు ఓటరు కార్డు విధానం తీసుకొచ్చింది. ఈ విధానం తీసుకొచ్చి 28 ఏళ్లు దాటింది. 1995 ప్రాంతంలో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషన్ టీఎన్ శేషన్ ఓటరు నమోదు పారదర్శకంగా ఉండేందుకు ఓటరు గుర్తింపు కార్డులను జారీ చేశారు. అప్పట్లో ఈ నిర్ణయం సంచలనం కలిగించింది. ఓటరు జాబితాలో ఉన్న క్రమ సంఖ్య ప్రకారం సదరు ఓటరు ఫొటోను కార్డుపై ముద్రించారు. అలాగే ఓటరు కార్డు ఉంటేనే ఓటు వేసే విధంగా నియమం విధించడంతో కచ్చితంగా మన ఓటు మనమే వేస్తున్నామనే భావన ఓటర్లలో కలిగింది. అప్పట్లో బ్లాక్ అండ్ వైట్‌లో ఉన్న ఓటరు గుర్తింపు కార్డు ఇప్పుడు కలర్‌లో డిజిటల్ విధానంలో ఏటీఎం కార్డు సైజ్‌లో స్పష్టంగా ముద్రితతమవుతోంది.

ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి..


మందమర్రిలో కాళ్లు మొక్కుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీఓదెలు, గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం


కాసిపేట గని వద్ద గడ్డం వంశీ కృష్ణ

కాసిపేట, మే 9: ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ అన్నారు. గురువారం కాసిపేట 2వ గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. తన తాత వెంకటస్వామి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్మికుల సంక్షేమానికి కాకా వెంకటస్వామి కృషి చేశారన్నారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడారు.

దండేపల్లి: ఇళ్లు లేని నిరుపేదలందరికి ఇందిరమ్మ ఇళ్ల పథకం వర్తింపజేస్తామని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కన్నెపల్లి సభలో మాట్లాడారు. ఆగస్టు 15లోపే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందన్నారు.

హాజీపూర్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పేర్కొన్నారు. గుడిపేట (దుబ్బగూడెం)లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

జైపూర్: కాకా కుటుంబాన్ని ఆదరించా లని టీజేఏసీ చైర్మన్, ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. ఐకే1ఏ గనిపై ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికులకు దివంగత కాకా వెంకట స్వామితో ఎనలేని అనుబంధం ఉందన్నారు. కాకా వెంకటస్వామి మనవడు గడ్డం వంశీకృష్ణను కార్మికులు గెలిపించాలన్నారు. ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి, మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావు, సీతారామయ్య, మునీర్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి పేర్కొన్నారు. బట్వాన్‌పల్లి, పెర్కపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని 2వ జోన్ పోచమ్మ ఆలయం ఏరియాలో జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ఇంటిం టా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని మూడో జోన్‌లోని నస్పూరి లింగయ్య- రాజమ్మ దంపతుల కాళ్లు మొక్కారు. 7, 8 వార్డులు, కేకే 5 బంగ్లాస్ ఏరియా, పాలచెట్టు ఏరియాల్లో ప్రచా రం నిర్వహించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హైమావతి అన్నారు.

తాండూర్: కేంద్రంలో ప్రభుత్వాన్ని మార్చడం ద్వారానే ప్రజలకు ఆర్థిక, సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి అన్నారు. ఐబీ కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పదేండ్ల కాలంలో బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బోయపల్లి మాజీ సర్పంచు భీమ సునీత, నాయకులు రాజేశం పార్టీలో చేరారు.

ఏసీసీ: గడ్డం వంశీకృష్ణకు విద్యార్థి సంఘాల జేఏసీ మద్దతు పలికింది. జేఏసీ చైర్మన్ చిప్పకుర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యమన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి


గుడిరేవులో రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీవో

దండేపల్లి, మే 9: వేసవి దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. గురువారం గుడిరేవు, ఆల్లీపూర్, దండేపల్లి గ్రామాలను సందర్శించి తాగునీటి సరఫరా, నర్సరీలో మొక్కల పెంపకం, పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. మిషన్ భగీరథ పథకం అందుబాటులో లేని ప్రాంతాలలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు అమలు చేసి, నీటి ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. బోరుబావులు, బహిరంగ బావులు, చేతి పంపులు, వ్యవసాయ బోరుబావు లలో నీటిని పరీక్షించి తాగేందుకు అనువుగా ఉన్న వాటిని ప్రజలకు అందించేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల నైప థ్యంలో పోలింగ్ కేంద్రాలలో వస తుల కల్పనపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు కల్పించే విధంగా సిబ్బందిని ఏర్పాటు చేయాల న్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముం దస్తుగా చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా రోజు మొక్కలకు నీరందించాలన్నారు. గ్రామ పంచాయతీలో రికార్డులు, రిజిష్టర్లను తనిఖీచేశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శులు ఉన్నారు.

టెట్ వివాదంపై విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యం తగదు

ఏసీసీ, మే 9: రాష్ట్రంలో ఉపాధ్యాయ పదోన్నతుల సంక్షోభానికి కారణమైన టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్)పై వివాదం పరిష్కారంపై విద్యాశాఖ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదని, ఏప్రిల్ 8న ఎన్‌సీటీఈ పంపిన వివరణ లేఖను బయటకు వెల్లడించడం లేదన్నారు. ఉపాధ్యాయులందరు టెట్‌కు దరఖాస్తు చేసుకునేలా విద్యాశాఖ కమిషనర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎన్నికలు ముగిసేలోగా ఎన్‌సీటీఈ మరికొన్ని అంశాలపై చర్యలు తీసుకుని బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. భాష పండితులకు, 2010కి ముందు నియామకమైన టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు.

ఎన్నికల విధుల్లో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, మే 9 : పార్లమెంట్ పరిధిలోని జిల్లాలో ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి నోడల్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కార్యక్రమానికి ముందు 72 గంటల సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నీడ, తాగునీరు, విద్యుత్, ఓఆర్‌ఎస్,మెడికల్ కిట్‌లు ఉంచాలన్నారు. అర్హత గతల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి


మాట్లాడుతున్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్

బెల్లంపల్లి, మే 9: రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ సూచించారు. గురువారం బెల్లంపల్లిలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. రోజు ఆసుపత్రికి ఎంత మంది వస్తున్నారని రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. డీసీహెచ్ఎస్ కోటేశ్వర్, మెడికల్ సూపరింటెండెంట్ రవి, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

మామిడి కొనుగోళ్లు ప్రారంభం

నెన్నెల, మే 9: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో మండల రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్‌పీసీ) ద్వారా మండలంలోని చిత్తాపూర్‌లో గురువారం మామిడి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. బంగెనపల్లి రకం కేజీకి రూ.35 చెల్లించి కొనుగోలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. నేరుగా తోటల్లోకి వెళ్లి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తామని పేర్కొన్నారు. తోటల్లోనే తూకం వేస్తామని దీంతో రైతులకు ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు ఉండవని, కోత కూలీ రైతులు భరించాల్సి ఉంటుందన్నారు. రైతులు తొందరపడి దిగుబడులను దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని, ఎఫ్‌పీసీకి విక్రయించి లాభాలు పొందాలన్నారు.

ఆఖరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మంచిర్యాల కలెక్టరేట్, మే 9: జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల మేరకు రైతుల వద్ద నుంచి ఆఖరి గింజ వరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ మోతిలాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 7,799 మంది రైతుల వద్ద నుంచి 55086 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.48.21 కోట్ల చెల్లింపులు చేశామన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకు వస్తే కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. వివరాలకు 6303928682లో సంప్రదించాలని తెలిపారు.

ఉపాధిహామీపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

వేమనపల్లి, మే 9: వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ పనులపై ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి కార్యదర్శులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. హరితహారానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. తాగునీటి సమస్య లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

కళతప్పిన గోదావరి


సీతారాంపల్లి వద్ద నీరు లేక ఎండిపోయిన గోదావరి నది

నస్పూర్, మే 9: యేటేటా భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. వేసవిలో నీటి వాడకం మరింత పెరుగుతోంది. భూగర్భ జల సంపద తక్కువ కావడంతో నీటి కోసం అల్లాడిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. చెరువులు, కుంటలు కబ్జాలు చేసి నిర్మాణాలు చేపట్టడంతో నీటి సమస్య మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. ఇళ్లలో ఉన్న బోర్లలో నీటి నిల్వలు చాలా వరకు తగ్గిపోయాయి. నస్పూర్‌లో గతేడాది ఏప్రిల్‌లో 9.93 మీటర్లలో నీరు ఉండగా ఈ ఏడాది ఏప్రిల్ నెలాఖరు నాటికి 11.10 మీటర్ల దిగువకు పడిపోయింది.

● ఎడారిని తలపిస్తున్న గోదావరి..

గోదావరి నదిలో నీటి లభ్యత తగ్గిపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడుతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సీతారాంపల్లి సమీపంలోని గోదావరి నది నుంచి సింగరేణి ప్రాంతలైనా శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలకు మంచినీటి సరఫరా జరుగుతోంది. నదిలో నీటిని ఇన్‌టెక్ వెల్స్‌కు మళ్లించడానికి ఇసుకలో కాలువల తవ్వకాలు చేపట్టారు. అయిప్పటికి ఇన్‌టెక్ వెల్‌కు నీరు అందడం లేదు. నదిలో ఉన్న ఇన్‌ఫిల్టర్ ద్వారా ప్రస్తుతం నీటిని పంపింగ్ చేస్తున్నారు.

● మున్సిపాలిటీలో నీటి సరఫరా ఇలా...

నస్పూర్ మున్సిపాలిటీలో గృహాలు 15,906, మున్సిపల్ నల్లా కనెక్షన్లు 11,635, మినీ ట్యాంకులు (పవర్ బోర్లు) 324, చేతి పంపులు 48 ఉన్నాయి. పవర్ బోర్లలో పంపులకు, చేతి పంపుల్లో నీటి మట్టం పడిపోయింది. దీంతో చాలా బోర్లలో ఆశించిన విధంగా నీరు రావడం లేదు. మున్సిపాలిటీలో మూడు ఐదు వేల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయి. మిషన్ భగీరథ ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీటి సరఫరా జరుగుతోంది. పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ 189 కిలో మీటర్లుండగా 17248 నల్లా కనెక్షన్లున్నాయి. ఆయా ప్రాంతాల్లో 40 వేల నుంచి 2 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన 28 ఓవర్ హెడ్ ట్యాంకులున్నాయి. ట్యాంకుల ద్వారా వార్డులోని ఇళ్లకు పైపులైన్ ద్వారా నీటి సరఫరా రోజు గంట పాటు రెండు పూటల సరఫరా చేస్తున్నారు.


నది వద్ద నీరు లేకుండా ఉన్న సింగరేణి ఇన్‌టెక్ వెల్

● కానరాని ఇంకుడు గుంతలు

వాన నీటిని నిల్వ చేసి భూగర్భంలోకి ఇంకే పరిస్థితి లేకుండా పోతోంది. నీటి సంరక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేయడం, చెరువులు, కుంటలను ఆక్రమించి నాశనం చేయడమే ప్రధాన కారణాలవుతున్నాయి. మానవ తప్పిదాల కారణంగా భూగర్భ జలమట్టం అడుగంటుతోంది. వాన నీటి పొదుపు చేసే ఇంకుడు గుంతలపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. గృహాలను నిర్మించుకునే సమయంలో ఇంకుడు గుంతల ఏర్పాటు పై ప్రజలకు చైతన్యం తేవాలి. ఇంకుడు గుంతల ఆవశ్యకత ప్రయోజనాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అధికారులపై ఉన్నది. వంద చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించే నిర్మాణంలో 1.5 మీటర్ల పొడవు, 2 మీటర్ల వెడల్పు, 6 క్యూబిక్ మీటర్ల లోతు తవ్వి ఇంకుడు గుంతలను నిర్మించాలి.


నదిలో సింగరేణి అధికారులు నీటి కోసం తవ్విన కాలువలు


హౌసింగ్ బోర్డు కాలనీలో బోరు















కన్యకాపరమేశ్వరి ఉత్సవాలు ప్రారంభం


పాల్గొన్న వాసవీ క్లబ్ సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, మే 9: మంచిర్యాల విశ్వనాథ ఆలయంలోని వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి వైశాఖ మాస ఉత్సవాలను గురువారం దేవాలయ కమిటీ సభ్యులు, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఆలయ అర్చకులు బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఈ నెల 18న కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా 108 జంటలతో హోమం, శోభాయాత్ర ఉంటుందన్నారు. ఆలయ అర్చకులు నరహరి శర్మ, బాలకృష్ణ శర్మ, భట్టాచార్య, రిషికేశ్ శర్మ, వాసవీ క్లబ్ సభ్యులు రాజేశం, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, బాల్మోహన్, వంశీకృష్ణ, ప్రవీణ్‌కుమార్, రాజేశం, జయప్రకాష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా

బెల్లంపల్లి, మే 9: తనను గెలిపిస్తే పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గురువారం కాంటాచౌరస్తాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలందరు కారు గుర్తుకు ఓట్లువేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దండేపల్లి: ఆరుగ్యారంటీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. నాయకపుగూడ, సామగూడ, అర్గుగూడ, ఊట్ల, కంచారబాయి, దమ్మనపేట గిరిజన గూడాల్లో కొప్పులఈశ్వర్‌ను గెలిపించాలని ప్రచారంచేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిన ఐదు నెలలు గడవకముందే ప్రజలు వ్యతిరేకతతో ఉన్నారన్నారు. చుంచు శ్రీనివాస్, పసర్తి అనిల్‌కుమార్, భూమన్న, గోళ్ల రాజమల్లు, గుర్రాల నరేష్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: బీఆర్ఎస్ ఎంపీఅభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని తుర్కపల్లిలో జెడ్పీటీసీ వేల్పుల రవి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ హయాంలో అమలుచేసినసంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఎండీ ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలకేంద్రంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యలు ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింద న్నారు. జెడ్పీటీసీ సత్యనారాయణ, నిరంజన్ గుప్తా, అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

కాసిపేట: పలుగ్రామాల్లో బీఆర్ఎస్‌నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కారు గుర్తుకు ఓట్లు వేయాలని ప్రజలను కోరారు.

తాండూర్: బోయపల్లి, తాండూర్ గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీ మాసాడి శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ సురేష్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజిత్‌రావు కోరారు. 16,17 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈప్రాంతవాసులకు ఇళ్లపట్టాలు, సింగరేణిలో వారసత్వఉద్యోగాలు ఇప్పించామన్నారు.కార్మికుడిగా పని చేసిన కొప్పుల ఈశ్వర్‌ను భారీమెజార్టీతో ఎంపీగా గెలిపించాలని కోరారు. సుబ్బయ్య, మెరుగు పవన్ కుమార్,రాజేంద్రపాణి,జగ్గయ్య, పాల్గొన్నారు.

బీజేపీ రాజ్యాంగం, రిజర్వేషన్‌లకు వ్యతిరేకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, మే 9: కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వస్తే అంబే ద్కర్ రాజ్యాంగం, రిజర్వేషన్‌లు రద్దు చేస్తారని, పదే పదే ఆ పార్టీ ఎంపీలు చెబుతున్నారని ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి తెలిపారు. గురువారం ఆదిజాం బవంతుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. మాదిగలకు సంబంధించిన సమస్యల పరిష్కారించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కేంద్రంలో ప్రధాని మోదీ, హోంమంత్రి అమితషా ఆదానీ, అంబానీలు కూటమిగా ఏర్పడి రాజ్యమేలుతు న్నారన్నారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించా లన్నారు. మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, జెడ్పీ ఛైర్మన్ నల్లాల భాగ్యలక్ష్మీ ఓదెలు, మాదిగసంఘం రాష్ట్రనాయకులు సునీల్ మాదిగ, ఆదిజాంబవంతుల సంఘం అధ్యక్షుడు వాసాల శంకర్, బిదునూరి శంకర్, కంబాల రాజనర్సు, పోశం నాయకురాలు సరిత, నాయకులు సుదర్శన్, ఉపేదర్‌గౌడ్, రమేష్, సంతోష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

భీమారం, మే 9: మండలకేంద్రంలోని ఎస్సీ అంబేద్కర్‌కాలనీకి చెందిన మాజీ వార్డుసభ్యులు తగరంరాజు, ఎంఆర్‌పీఎస్ నాయకులు తగరం మొం డిలతో పాటు పలువురు గురువారం కాంగ్రెస్ నాయకులు చేకుర్తి సత్యనారా యణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే వివేక్‌వెంకట స్వామి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్‌ను ఓడించాలి

తాండూర్, మే 9 : ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. గురువారం మండలకేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ఆయన మాట్లాడారు. రాజీవ్‌నగర్‌కు చెందిన యువకులు బీజేపీలోచేరగా వారికికండువాలు కప్పి ఆహ్వా నించారు. భరత్‌కుమార్, శీకృష్ణదేవరాయలు, కొయ్యల ఏమాజీ పాల్గొన్నారు.

కన్నెపల్లి: బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ కోరారు. కన్నెపల్లి, సుర్జాపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఉపాధికూలీల వద్దకు వెళ్లి బీజేపీకమలం పువ్వు గుర్తుకు ఓట్లు వేయాలనిఅభ్యర్థించారు.రామయ్యయాదవ్,రాజయ్య, పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధం

మంచిర్యాల కలెక్టరేట్, మే 9: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఈనెల13న జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లాఎన్నికల అధికారి, కలెక్టర్‌బదావత్‌సంతోష్ పేర్కొన్నారు. గురువారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో మీడియా ప్రతినిధులతో ఏర్పాటుచేసిన సమావేశంలో డీసీపీ అశోక్‌కుమార్, ఆర్డీవో రాములుతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 741పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కేంద్ర రక్షణదళాలతో బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. ఆఖరి 48 గంటల్లో ఎలాంటి ప్రచారకార్యక్రమాలు నిర్వహించకూడదని, పోలింగ్ కేంద్రానికి 100మీటర్ల పరిమితి నిబంధనను ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు. ఆఖరి 72గంటల సమయంలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. డీసీపీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం 3సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలు వచ్చాయన్నారు. ప్రతి మండలంలో స్ట్రైకింగ్‌ఫోర్స్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు వైన్‌షాపులు మూసి ఉంచడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోలింగ్‌శాతం పెంచేవిధంగా మీడియా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పౌర సంబంధాల అధికారి శారద, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిదులు పాల్గొన్నారు.

మెజార్టీ కోసం పాట్లు

- టార్గెట్ ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల ఓటర్లే
- ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ప్రధాన పార్టీలు

కాగజ్‌నగర్, మే 9: పార్లమెంటు ఎన్నికల ప్రచార గడువు సమీపిస్తుండటంతో ఆయా రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదునెడుతున్నారు. ఈసారి ముక్కోణపు పోటీ నెలకొనటంతో తమకు అత్యధిక మెజార్టీ వచ్చేలా ఆయా పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్లను టార్గెట్ చేస్తున్నారు. ఆసిఫాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో కూడా సీఎం రేవంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికల్లో ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గ ఓటర్లే కీలకంగా గెలుపోటములను దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కతోపాటు కింద క్యాడర్ కార్నర్ మీటింగ్‌లు పెడుతున్నారు. కాంగ్రెస్‌కు ఓటేయాలని ఇంటింటా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కూడా ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ కూడా ఆదినుంచి ఈ రెండు నియోజకవర్గాలనే టార్గెట్ చేస్తున్నారు. నిత్యం పట్టణాలు, పల్లెల్లో తమదైన శైలిలో హామీలిస్తూ ప్రచారం చేస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలివీచిన కూడా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి జనం పట్టం కట్టారు. అలాగే సిర్పూరులో కూడా బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీష్ బాబును గెల్పించారు. ఈరెండు నియోజకవర్గాల్లో నచ్చినపార్టీకే వన్‌సైడ్ వేస్తారన్నది తేలిపోయింది. మాజీ ఎమ్మెల్యే కోనప్ప తన క్యాడర్‌తోపాటు పార్టీ ఓట్లను పక్కాగా లెక్కించి లక్షమెజార్టీ వచ్చేట్టు చూడాలని మంత్రి సమక్షంలో కార్యకర్తలను కోరారు. అన్నిమండలాల్లో బసచేసి కాంగ్రెస్‌పార్టీ మెజార్టీ కోసం కృషి చేస్తున్నారు. బీజేపీ సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు, బీజేపీ జిల్లాఅధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పల్లెలు, పట్టణాల్లో తిరుగుతూ మెజార్టీ ఓట్ల కోసం కృషి చేస్తున్నారు. మూడు పార్టీలు ఈ రెండు నియోజవర్గాలనే టార్గెట్ చేసి ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఏ పార్టీకి ప్రజలు మొగ్గుచూపుతారన్నది ఎన్నికల ఫలితాల తర్వాతే తేలనుంది.

కోరం లేక మండల సమావేశం వాయిదా

వేమనపల్లి, మే 9 : వేమనపల్లి మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి తెలిపారు. మళ్లీ సమావేశం నిర్వహించే తేదీని వెల్లడిస్తామని పేర్కొన్నారు.

బహుజనులకు అవకాశం కల్పించాలి

నస్పూర్, మే 9: బహుజనులకు అవకాశం కల్పించి పార్లమెంట్‌కు పంపాలని, తద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకు న్యాయం జరుగుతుందని పెద్దపల్లి పార్లమెంట్ బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి ఇరుకుల్ల రాజనర్సయ్య అన్నారు. నస్పూర్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాయవతి నాయకత్వంలో ఎస్సీఎస్టీ బీసీ, మైనార్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలు ఆలోచించి అవకాశం ఇవ్వాలని కోరారు. కాదాసి రవీందర్, మల్లేష్, బాల కళ్యాణ్, రవి కుమార్, రాజు పాల్గొన్నారు.

తీవ్రవాదాన్ని తుదముట్టించిన మోదీ



ప్రచారంలో మాట్లాడుతున్న మురళీధర్‌రావు

ఏసీసీ, మే 9: దేశంలో తీవ్రవాదాన్ని ప్రధాని మోదీ తుదముట్టించారని బీజేపీ సీనియర్ నేత,మధ్యప్రదేశ్ రాష్ట్ర ఇన్‌చార్జి మురళీధర్‌రావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే, జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌తో కలిసి పాల్గొన్నారు. మురళీధర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అన్ని కుంభకోణాలే అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక జాతీయ రహదారులు నిర్మించి అనేక పరిశ్రమలు స్థాపించారన్నారు. మల్లారెడ్డి, ఏమాజీ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిర్పూరు ఎమ్మెల్యే హరీష్‌బాబు కోరారు. మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మూడోసారి మోదీ ప్రధాని అయితేనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మధుసూదన్‌రావు, శంకరయ్య, బద్రనాయక్, గోపాల్, ప్రవీణ్ పాల్గొన్నారు.

భీమిని: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ అన్నారు. వెంకటాపూర్, మల్లీడి గ్రామాల్లో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని కోరారు. సత్యనారాయణ, వెంకటేష్, కొంక శ్రీనివాస్, పొట్లపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూరు: అంగ్రాజ్‌పల్లి, లింగంపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని ప్రజలను కోరారు.

కాసిపేట: నాలుగు దశాబ్దాలుగా గడ్డం కుటుంబ సభ్యులు రాజకీయ దోపిడికి పాల్పడుతూ పదవులు దక్కించుకుని దేశంలో వారి పరిశ్రమలను విస్తరించుకుంటున్నారని బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే అన్నారు. కాసిపేటలో ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి వినోద్, వివేక్‌లు గెలిచారని, ఇప్పుడు వివేక్ కొడుకు వంశీని పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలిపి ప్రజలనుమోసం చేయడానికి వస్తున్నారన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

భీమిని, మే 9: మండలంలోని 12 గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో 13వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున ఎవరినీ ఆహ్వానించలేదని ఎంపీడీవో తెలిపారు. 1 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 ఆర్థిక సంవత్సరానికి రూ.2.12 కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులను చేసినట్లు అధికారులు వెల్లడించారు. పది బృందాలతో డీఆర్‌పీలు, ఎస్‌ఆర్‌పీలు, వీఎస్‌లు గ్రామాల్లో పనులను తనిఖీ చేశారు. పనుల్లో అవకతవకలను వెల్లడించారు. డీఆర్‌డీవో కిషన్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.17 వేలు జరిమానా విధించారు. రూ. 58,949 రికవరీ చేయాలని ఆదేశించారు. అడిషనల్ డీఆర్‌డీవో దత్త రావు, ఎంపీడీవో గంగామోహన్, ఎంపీఓ సఫ్దార్ అలీ, ఏపీవో భాస్కర్‌రావు, విజిలెన్స్ అధికారులు సురేష్‌స్టేట్ క్వాలిటీ అధికారి పులి చంద్రశేఖర్, డీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం, రిజర్వేషన్‌లపై తప్పుడు ప్రచారం



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

మందమర్రిటౌన్, మే 9: ఎస్సీ రిజర్వేషన్‌ను ఏబీసీడీలుగా వర్గీకరించ డానికి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకమని, కాంగ్రెస్ పార్టీకి ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. గురువారం సాయిమిత్ర గార్డెన్‌లో నిర్వహించిన మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ గెలిస్తే రాజ్యాంగం, రిజర్వేషన్‌లు రద్దవుతాయని అబద్దపు ప్రచారాలు చేస్తున్నారని, వీటికి ఎలాంటి ఢోకా ఉండదని తెలిపారు. 80 లక్షల మంది మాదిగలు ఉంటే ఒక్క సీటు కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వకపోవడం దారుణమ న్నారు. ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే మాట్లాడారు. బీజేపీ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిరపాలన

దండేపల్లి, మే 9: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిరపాలన సాధ్యమవుతుందని నేతకాని మహర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాడి నర్సయ్య అన్నారు. గురువారం పెద్దపేట, ద్వారక, లక్ష్మీకాంతపూర్ గ్రామాల్లో నేతకాని మహర్ సంఘం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ గెలుపునకు సంఘం నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నేతకాని మహర్‌కుల సంఘాన్ని పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. జాడి ప్రేమ్‌సాగర్, లక్ష్మన్, జనార్ధన్, శంకర్, సత్యనారాయణ, జస్వంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మందమర్రిరూరల్, మే 9 : మండలంలోని చిర్రకుంట గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు దుర్గం రమణకుమారి, మనోహర్, అశోక్, శ్రీనివాస్, దుర్గం తిరుపతిలతో పాటు తదితరులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గందె రాంచందర్, ఒడ్నాల కొమురయ్య, నీలయ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న యాదవ్

నస్పూర్, మే 9: గొల్లకుర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎన్నికల తర్వాత కలిసి విన్నవిస్తామని గొల్లకుర్మ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు యాదనబోయిన రాజన్న యాదవ్ అన్నారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు గొల్ల కుర్మల సంక్షేమానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. గొల్ల కుర్మల అభివృద్ధికి ఐదెకరాలు ఇచ్చి రైతువేదిక మాదిరిగానే ప్రత్యేక షెడ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వాలన్నారు. సబ్సిడీ గొర్రెల కోసం డీడీలు చెల్లించారని, ఇప్పటి వరకు యూనిట్లను మంజూరు చేయలేదన్నారు. వాటిని పరిష్కరించి ప్రత్యేక యూనిట్లను మంజూరు చేయాలన్నారు. మల్లయ్య యాదవ్, రాజన్న యాదవ్, సమ్మ రాజన్న యాదవ్, రామన్న, మల్లిక పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

రామకృష్ణాపూర్, మే 9: కేంద్ర ప్రభుత్వ మతోన్మాద బీజేపీ నిరంకుశ పాలనను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. గురువారం రామకృష్ణాపూర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేంద్రంలో మోదీ పాలనలో ఉన్నత స్థాయి వర్గాలను అందలం ఎక్కిస్తూ నిరుపేదలను తొక్కేస్తున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఆధాని, అంబానీలకు అమ్ముతున్నారన్నారు. మతోన్మాద బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించి లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ బలపరుస్తున్న పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణను గెలిపించాలన్నారు. మోదీ పాలనలో ప్రజాస్వామ్యం విధ్వంసం అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. వనం సత్యనారాయణ, పోతర్ల రాములు, బైర కొమిరేల్లి, రాంపల్లి రాజం, తోకల రాజన్న, జంగపల్లి సత్యనారాయణ, ఈరవేన రవీందర్, మామిడాల సత్యనారాయణ, గోవిందుల రమేష్, దెవయ్య, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

జైపూర్, మే 9: జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం శివారులో రైల్వేట్రాక్ సమీపంలో పగిళ్ల కొండమ్మ(70) అనే వృద్ధురాలు మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. మంచిర్యాలలోని రెడ్డి కాలనీలో నివాసం ఉండే పగిళ్ల యాదగిరి తల్లి కొండమ్మకు మతిస్థిమితం లేకపోవడంతో ఈనెల 2న ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఈనెల 6న మంచిర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఇందారంలో గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెంది ఉందన్న సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మిస్సింగ్ కేసులపై ఆరా తీసిన పోలీసులు కొండమ్మ కుటుంబీకులకు సమాచారం అందించగా వారు గుర్తించారు. ఇందారంలో బంధువులు ఉంటారని, వారి వద్దకు వచ్చి ఉంటుందని కుటుంబీకులు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

చెన్నూరు, మే 9: చెన్నూరు పట్టణ శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని గురువారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా లారీ కనిపించడంతో తనిఖీలు చేయగా అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నారని గుర్తించి సీజ్ చేసి చెన్నూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కోటపల్లి మండలంలోని కొల్లూరు ఇసుక క్వారీల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన పోలీసులు

దండేపల్లి,మే 9: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను ఎస్సై ఎల్ భూమేష్, రూట్ మొబైల్ టీమ్ సిబ్బందితో పరిశీలించారు. గురువారం తాళ్ళపేట, నాగసముద్రం, మాకులపేట, లింగాపూర్, గుడిరేవు, మ్యాదరిపేట, పెద్దపేట, లక్ష్మీకాంతపూర్, ద్వారక తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులపై ఆరాతీశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలు సేకరించారు. ఏఎస్సై శ్యాముల్ పాల్, పోలీసు సిబ్బంది, ఉన్నారు.

నమ్మించి నగదు దోచుకున్న ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ

లక్షెట్టిపేటరూరల్, మే 9: పాత కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కున్నారపు లచ్చవ్వ అనే మహిళకు మాయమాటలు చెప్పి డబ్బులు కాజేసిన ఇద్దరు నిందితులను గురువారం కోర్టులో హాజరు పర్చినట్లు సీఐ నరేందర్, ఎస్ఐ చంద్ర కుమార్ తెలిపారు. లచ్చవ్వ గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతోంది. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన శివరాత్రి సదయ్య, పెద్దపల్లి మండలం తుర్కల మద్ది కుంటకు చెందిన గాదాసు రాజయ్యలు ఈ నెల 7న లచ్చవ్వ భర్త బయ టకు వెళ్లడం గమనించి ఇంటి నిర్మాణ పనులకు సిమెంటు, ఇటుక పంపి స్తున్నామని, రూ.25 వేలు ఇవ్వామన్నాడని చెప్పారు. లచ్చవ్వ రూ.24 వేలు ఇవ్వగా అక్కడ నుంచి వెళ్లిపోయారు. భర్త ఇంటికి వచ్చిన తర్వాత తాను ఎవర్ని పంపలేదని చెప్పడంతో మోసపో యానని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గురువారం స్థానిక కరీంనగర్ చౌరస్తాలో పోలీసులు వాహనాన్ని చూసి పారిపోతుండగా పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారన్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 23 వేల నగదు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి

జన్నారం, మే 9 : కాంగ్రెస్ పార్టీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని ఆదిలాబాద్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మాపూర్, రాంపూర్, రోటిగూడ తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం కృషి చేస్తుందన్నారు. దేశం ఉన్నత స్థానంలో ఉండాలంటే కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని కోరారు. అలాగే ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్‌కు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కేంద్రమంత్రి వేణుగోపాలచారి, నాయకులు ముజాఫర్ అలీ, చంద్రయ్య, పసివుల్లా, రాజశేఖర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరించిన ఎంఈవో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో వెంకటేశ్వర స్వామి, సిబ్బంది

రెబ్బెన, మే 9: 'ఫోన్ కొట్టు.. కథ విను' పోస్టర్లను గురువారం ఎంఈవో వెంకటేశ్వర స్వామి రెబ్బెనలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలు, పుస్తకాలను చదవటం ద్వారా పిల్లల్లో జ్ఞానాన్ని ఆలోచన శక్తిని పెంపొందించవచ్చన్నారు. రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 04045209722ఫోన్ చేస్తే కథ వినవచ్చన్నారు. వేసవి సెలవులు వృథా చేయకుండా చక్కటి కథలను వినాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి శ్రీనివాస్, ఎం రవి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం

● మండలంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ ప్రచారం



సిర్పూర్(యు)లో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

సిర్పూర్(యు), మే 9: గ్రామాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని ముంజీగూడ, బాండేయేర్, రుద్రకాస, నేట్నూర్ తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం బీజేపీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు కోట్నాక విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు గెడం శంభూ, కుమ్ర భీంరావు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రతిఇంటికి వివరించాల్సిన బాధ్యత బూత్‌లెవల్ కార్యకర్తలపై ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానికంగా బూత్‌లెవల్ కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. పీఎం మోదీ చేపట్టిన సంక్షేమపథకాలు నిరుపేదలకు వరంగా మారినట్టు తెలిపారు.

బెజ్జూరు: బెజ్జూరు గ్రామపంచాయతీలోని ఎల్కపల్లిగ్రామంలో గురువారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈనెల11న బెజ్జూరులోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీబీజీకేఎస్‌లో చేరికలు

కాసిపేట, మే 9: కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ నాయకులు బీఆర్ఎస్ అనుబంధసంఘం టీబీజీకేఎస్‌లో చేరారు. ఐఎన్‌టీయూసీ కాసిపేట 2వ గని పిట్ సెక్రెటరీ కారుకూరి తిరుపతి, మైన్ కమిటీ సభ్యుడు కొత్తపల్లి ఉదయ్ టీబీజీకేఎస్‌లో చేరారు. వీరికి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, మాజీఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కండువాలు కప్పి ఆహ్వానించారు.

నేతల చూపు.. పల్లెల వైపు

● ఉపాధి కూలీలే లక్ష్యంగా ప్రచారాలు



వాంకిడి, మే 9: గ్రామీణప్రాంతాల్లో పోలింగ్‌శాతం ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లో ఉండే ప్రజలు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలనే తపనతో ఉంటారు. అందువల్ల పార్టీ అభ్యర్థులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల పైనే దృష్టి సారిస్తున్నారు. పల్లె ప్రజలను ప్రసన్నం చేసుకునేందుకు అన్నిపార్టీల నేతలు ప్రయత్నిస్తున్నారు. వారిని చైతన్యం చేస్తే తప్పకుండా తమకే ఓటువేస్తారనే నమ్మకంతో ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ పరిధిలోని కుమరంభీం జిల్లాలో వివిధ పార్టీల ముఖ్యనాయకులు, కార్యకర్తలు, పల్లెల్లోనే తిరుగుతూ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.

- ఉపాధి కూలీలే లక్ష్యంగా..

గ్రామాల్లో ఉదయం, సాయంత్రం పార్టీ నాయకులు వెళ్లి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఎక్కువగా సాయంత్రం 6 గంటలనుంచి రాత్రి 9గంటలవరకు ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తమ అభ్యర్థికి ఓటువేయాలని వేడుకుంటు న్నారు. ఉదయం మాత్రం ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని తెలుసుకొని కూలీల వద్దకు వెళ్లి తమ పార్టీ గురించి చెబుతూ ఓట్లు తమ అభ్యర్థులకు వేసి గెలిపించాలని కోరుతున్నారు. ఒకేచోట 200మంది కూలీలు ఉండడంతో నాయకులు ప్రచారం చేయడానికి అనుకూలంగా ఉంటోంది. ఒక రోజు ఒకపార్టీ వారు వెళితే.. ఇంకోరోజు మరోపార్టీ వారు వెళ్తున్నారు. సుమారు గంటపాటు వారివద్దనే ఉంటూ తమపార్టీలు అమలుచేస్తున్న సంక్షేమపథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులను కూలీలకు వివరిస్తున్నారు.

- స్థానిక నాయకులు అన్ని తామై..

మూడు రోజుల్లో ప్రచారఘట్టం ముగియనుంది. ఇంత తక్కువ వ్యవధిలో లోక్‌సభ స్థానం పరిధిలోని అన్ని గ్రామాల్లో అభ్యర్థులు పర్యటించడం సాధ్యం కాదు. అందుకే వారి అనుచరులు, పార్టీ ముఖ్య నాయకులు బంధువులు ఎక్కడిక్కడ ప్రచార బాధ్యతలను భుజానెత్తుకుంటున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు బహిరంగ సభలు, కార్నర్‌సమావేశాలు, ర్యాలీలకు ప్రాధాన్యమి స్తుంటే ఆయాపార్టీల స్థానిక నాయకులు ఇంటింటికి వెళ్లి ఓట ర్లను కలుస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఉదయం సాయంత్రం స్థానికనాయకులు గ్రామాలకు వెళ్లి ప్రజలను కలుస్తూ పార్టీలు చేస్తున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. దీంతోపాటు గ్రామాల్లో ప్రజలు తమ సంఘాలకు అవసరమైన వనరులను సమకూర్చాలని డిమాండ్‌చేస్తే వెంటనే జిల్లానాయకులకు సమాచారమిస్తూ సంఘాలకు అవసరమున్న వనరులను సమకూర్చేందుకు హామీలు ఇస్తున్నారు.

ఓటరు చీటీ రాలేదా.. ఇలా చేయండి

వాంకిడి, మే 9: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఊరూరా ఓటరు స్లిప్పులను పంపిణీ చేస్తున్నారు. ఓటరు స్లిప్పులు అందని వారు పోలింగ్ కేంద్రం, క్రమసంఖ్యను ఇలా తెలుసు కోవచ్చు. ముఖ్యంగా కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. ఓటరు లిస్టులో గంటల తరబడి వెతికి ఏ క్రమసంఖ్యలో తమపేరు ఉందో సరిచూసు కోవడం కష్టమే. కేవలం సెల్‌ఫోన్‌లో ఓటరు కార్డు నెంబర్‌ను సంక్షిప్త సమాచారం (ఎస్‌ఎంఎస్) పంపడం ద్వారా పోలింగ్ బూత్ సంఖ్య ఓటరు లిస్టులో పేరు ఏ నంబరులో ఉందో తెలసుకునే సౌకర్యాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

- 1950టోల్ ఫ్రీ నంబరుకు ఈసీఐ స్పేస్‌ఇచ్చిన అనంతరం యూఎస్‌ఈ (ఆంగ్ల అక్షరాలు) తర్వాత ఓటరు కార్డుపై ఉన్న ఏడుఅంకెలను నమోదుచేసి ఎస్‌ఎంఎస్ పంపించాలి(ఉదాహరణకు ఈసీఐ యూస్....256) వెంటనే మీరు ఓటు వేసే పోలింగ్ బూత్ సంఖ్య, లిస్టులో క్రమసంఖ్యలు సంక్షిప్త సందేశంలో వస్తాయి.

పెన్‌గంగలో పడి వృద్ధురాలు మృతి

కౌటాల, మే 9: మండలంలోని వీరవెల్లి గ్రామానికి చెందిన చునార్కర్ మీరాబాయి(58) గురువారం ప్రమాదవశాత్తు పెన్‌గంగా నదిలో పడి మృతిచెందినట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. మృతురాలి కుమారుడు మేరేశ్వర్, ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మీరాబాయి బుధవారం తన చేనులో మిరపపంట ఏరివేతకు వెళ్లింది. సాయంత్రం అయినా తిరిగిరాకపోవడంతో ఆమె కోసం కుమారుడు వెళ్లినా కనిపించ లేదు. చివరకు పెన్‌గంగా నది ఒడ్డున చెప్పులు, అడుగు జాడలు కనిపించడంతో అనుమానంతో ఒడ్డు వద్ద పరిశీ లించగా కొంత దూరంలో నీటిలో మృతదేహం కనిపించినట్లు తెలిపాడు. కాగా నీటిని తాగడానికి పెన్‌గంగాకు వెళ్లగా ప్రమా దవశాత్తు అందులోపడి మృతిచెంది ఉంటుందన్నారు. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయాలి: మంత్రి సీతక్క



సిర్పూర్(యు) పంగడిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సిర్పూర్(యు)/కాగజ్‌నగర్/జైనూరు, మే 9: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను చూసి ఓటు వేయాలని మంత్రి సీతక్క అన్నారు. గురువారం ఆమె సిర్పూర్(యు) మండలంలోని పంగడి, కాగజ్‌నగర్‌మండలంలోని కోసిని, జైనూరు మండలంలోని డబోలి, గౌరి, జైనూర్ గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనిచేసే వారికే ఓటు వేయలన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే నే పేదల కోసం పనిచేసేదన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణకు ఓట్లేసి అధిక మెజార్టీతో గెల్పించాలని కోరారు. అదే విధంగా పలువురు పార్టీలో చేరగా వారికి కాంగ్రెస్ పార్టీకండువా కప్పి ఆహ్వానించారు. జైనూరు మండలంలో కాంగ్రెస్ నాయకులు కాలేజీగూడ నుంచి మండలకేంద్రం వరకు మోటార్‌సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్, మాజీమున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్, మాజీ జడ్పీచైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ ఆసిఫాబాద్ కోఆర్డినేటర్ ఆత్రం భాస్కర్, ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఛైర్మన్ కుడ్మేతవిశ్వనాథ్‌రావు,శ్యాంనాయక్,ఆత్రం గోవింద్ రావు, గెడం మారుతి, ముఖిద్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు: బెజ్జూరు మండలంలోని ఎల్కపల్లి, సిద్దాపూర్ గ్రామాల్లో గురువారం కాంగ్రెస్‌నాయకులు ఉపాధి హామీ పనిప్రదేశానికి వెళ్లి ఆదిలాబాద్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిఆత్రం సుగుణక్కను అత్యధికమెజార్టీతో గెలిపించాలని కోరారు.

తిర్యాణి: ఆత్రం సుగుణను గెలిపిద్దామని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి ఉపేందర్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పెంచికలపేట: ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం మండలంలో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.

పెంచికలపేట: కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు రావి శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని బొంబాయిగూడ గ్రామంలో సీపీఎం నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్సీ



బెజ్జూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

బెజ్జూరు, మే 9: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సంధ్బంగా మాట్లాడుతూ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వహయాంలోనే గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుష్పలత, నాయకులు షణ్ముఖ, సురేష్‌గౌడ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● బీఆర్ఎస్ విజయం ఖాయం..

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్/లింగాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు విజయం ఖాయమని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. గురువారం ఆమె జైనూరు మండలంలోని రాసిమెట్ట, జైనూర్, పొలాస, పవర్‌గూడ, జైనూర్, లింగాపూర్ మండలంలోని కంచన్‌పెల్లి, లింగాపూర్, పిట్టగూడ, వంజారీగూడ తదితర గ్రామాల్లో ఆమె కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపునకు దోహదపడుతున్నాయన్నారు.

వాంకిడి: మండలంలోని బంబార గ్రామంలో గురువారం జడ్పీటీసీ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పెంచికలపేట: మండలంలోని కొండపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఉపాధిహామీ ప్రదేశానికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఆత్రం సక్కును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం

జిల్లా వార్తలు

8

శుక్రవారం 10 మే 2024

ఓటుతోనే మార్పు

- ఇంటి వద్ద ఓటును వినియోగించుకున్న వికలాంగులు, వృద్ధులు
- ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ 85శాతం పూర్తి
- యువత మేలుకోవాలి
- ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం

కాగజ్‌నగర్, మే 9: ఓటింగ్ శాతం పెంచేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చేస్తున్న వివిధ చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఇంటివద్దే ఓటు వేసేందుకు చేపట్టిన ప్రక్రియ విజయవంతమైంది. ఎన్నికల్లో ఓటు హక్కు ఎంతో కీలకం. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. 85ఏళ్ల వృద్ధు లకు, వికలాంగులకు ఇంటివద్ద ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు బ్యాలెట్ సిస్టం ద్వారా ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. దరఖాస్తులు చేసుకున్న వృద్ధులు, వికలాంగులు 90శాతం ఓటు హక్కు ను వినియోగించుకున్నట్టు అధికారులు ప్రకటించారు. ఇక ప్రభుత్వ ఉద్యోగు ల్లో కూడా పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ఇప్పటికీ 85శాతానికి చేరుకుంది. కాగా జిల్లాలో మొత్తం ఓటర్లు 16,50,175 ఓటర్లు ఉండగా, ఇందులో 18-39సంవత్సరాల ఓటర్లు 8,76,977 ఉండటం విశేషం. యువ ఓటర్లు తప్ప కుండా ఓటింగ్ లో పాల్గొనేందుకు ఎన్నికల అధికారులు రెండు నెలల క్రితమే అన్ని ప్రభుత్వ ప్రయి వేటు డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఓటు విలువపై అవగాహన కల్పించారు.

ఆదర్శం.. జాకీర్‌పాషా

ఓటు వేయాలన్న లక్ష్యంతో కాగజ్‌నగర్‌కు చెందిన జాకీర్ పాష ప్రతి ఎన్ని కల్లో తన ఓటు హక్కు ను వినియో గించు కుంటున్నాడు. చిన్నప్పటి నుంచే జాకీర్ పాషాకు రెండు చేతుల లేవు. అయినా కూడా ప్రతి ఎన్నికల్లో కాలుతోనే ఓటేసి తన ఓటు హక్కును వినియోగించు కుంటాడు. ఈయన ఓటు వేయటంపై స్థానిక అధికారుల నుంచి రాష్ట్రపతి వరకు జాకీర్ పాషాను అభి నందించారు. రెండు చేతులుండీ కూడా కొంత మంది ఓటింగ్ వేయ కుండా వదిలేస్తుంటారు. ఓటు తోనే మార్పు వస్తుందన్న జాకిర్ ఆశయం అందరికీ ఆదర్శ ప్రాయంగా మారింది. అలాగే 85ఏళ్ల వృద్ధులు, మంచానికే పరిమితమైన వృద్ధులు కూడా హోం ఓటింగ్ ద్వారా తమఓటు హక్కును వినియోగించుకున్నారు.



జాకిర్ పాషా కాలి వేలుకి సిరా గుర్తు పెడుతున్న సిబ్బంది

ముమ్మరమైన ప్రచారం..

ఈసారి జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా కేంద్ర ఎన్నికల సంఘం అన్ని చర్యలు తీసుకుంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తిన వాటిలో ఈ సారి మార్పులు చేశారు. ఓటింగ్ శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలతో ఈ సారి ఓటింగ్ శాతం గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

పోలింగ్ శాతం పెంచేందుకు విస్తృతంగా డిజిటల్ ప్రచారం

వాంకిడి: ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెస్తూ పోలింగ్‌శాతం పెంచేందుకు ఎన్నికల సంఘం విస్తృత ప్రచారం చేస్తోంది. జన బాహుళ్యంలో ఉండే డిజిటల్ మాధ్యమాల ద్వారా ఓటు ప్రాధాన్యతను వివరిస్తోంది. ఇప్పటికే ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో అవగాహన సదస్సులు, పలురకాల పోటీలు, విద్యా సంస్థల్లో నమూనా పోలింగ్ నిర్వహణతోపాటు సామాజిక మాధ్యమాలతో ప్రచారం నిర్వ హిస్తున్నారు. రైల్వే, బస్‌స్టేషన్లు, తపాలా కార్యాలయాలు, బ్యాంకులతోపాటు ఇతర కార్యాలయాల్లోనూ ఓటుహక్కు వినియోగించు కోవాలంటూ వాల్‌పోస్టర్లు ఏర్పాటు చేశారు. ఇటీవల డిజిటల్ చెల్లింపులు పెరిగిన నేపథ్యంలో ప్రతి చెల్లిం పుపై ఓ ప్రచారం పోస్టరు కనిపిస్తోంది. ప్రజలు అత్యధికంగా ఉపయోగించే ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీ ఎం తదితర యాప్‌ల ద్వారా ఓటు హక్కు వినియో గంపై అవగాహన కలిగిస్తున్నారు. ఫోన్‌పేలో సగ ర్వంగా ఓటేద్దాం(లెట్స్ ఓట్ విత్ ప్రైడ్) అనే నినాదం ఆకట్టుకుంటోంది.



ఇంటి వద్దే ఓటేస్తున్న వృద్ధురాలు



ఎన్నికల సంఘం సామాజిక మాధ్యమాల్లో కల్పిస్తున్న అవగాహన చిత్రం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

- డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్

కెరమెరి, మే 9: ఈనెల13న నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్నిరకాల వసతులు కల్పించాలని డీఎల్‌పీవో ఉమర్ హుస్సేన్ అన్నారు. గురువారం మండలంకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 41పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని అందులో కేస్లాగూడ పోలింగ్ కేంద్రాన్ని మోడల్‌పోలింగ్ కేంద్రంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అన్ని పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణారావు, ఎంపీవో అంజద్‌పాషా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వేశ్వర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు రద్దు చేసే ప్రసక్తే లేదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

ఆసిఫాబాద్‌రూరల్, మే 9: రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లా డుతూ 2019లో మరో పదిసంవత్సరాల పాటు రిజర్వేషన్లు పొడగిస్తూ పార్లమెంట్‌లో తమ ప్రభుత్వం చట్టం తీసుకు వచ్చిందని గుర్తు చేశారు. 2029వరకు వీటిని మార్చే అవకాశం ఉండదన్నారు. రాజ్యాంగం బీజేపీకి బైబిల్, ఖురాన్, భగవద్గీత లాగా పవిత్రమైనదన్నారు. మతపరమైన రిజర్వేషన్లు సరైనవి కాదని రాజ్యాంగ రచయిత అంబేద్కర్ అభిప్రాయపడ్డారని గుర్తుచేశారు. మతపరమైన రిజర్వేషన్లవల్ల ముస్లింలకు (బీసీ-ఈ) ఇవ్వడంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో 31మంది బీసీ కోటాకింద ముస్లింలు కార్పొరేటర్లుగా ఎన్నికయ్యారన్నారు. దీంతో మిగితా బీసీలు కూడా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. సమా వేశంలో ఎంపీపీ మల్లికార్జున్, ఎమ్మార్పీఎస్ నాయుడు కేశవ రావు, విశాల్, మురళీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో

కాగజ్‌నగర్, మే 9: కాగజ్‌నగర్‌లోని సాయి స్వాస్థ్య ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌వో సీతారాం నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా అందిస్తున్న చికిత్స, తదితర అంశాలపై వాకాబు చేశారు. ఆయన వెంట డాక్టర్ దివ్య, మల్లేషం, లక్ష్మణ్, రంజిత్, శివ, తదితరులున్నారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి: ఎస్ఈ



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ వాసుదేవ్

ఆసిఫాబాద్ రూరల్, మే 9: జిల్లాలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా ఏర్పడిన విద్యుత్ అంత రాయాన్ని పరిష్కరించి మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎస్ఈ వాసుదేవ్ తెలిపారు. భారీ వర్షాలకు, ఈదురుగాలులకు 23స్తం భాలు, అయిదు ట్రాన్స్ ఫార్మర్లు నేల కొరిగాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన వాటి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలోని కెరమెరి, కౌటాల తదితర ప్రాంతాల్లో తక్షణ చర్యలతో విద్యుత్ సరఫరా పునరుద్ధరించామని తెలిపారు. మిగిలినప్రాంతాల్లో సాధ్యమైనంత త్వరగా సమస్య పరిష్కరిస్తా మన్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలపై 7901628370ను సంప్రదించవచ్చని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐఎఫ్ఎస్



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ట్రైనీ ఐఎఫ్ఎస్ ప్రసాద్‌రెడ్డి

ఆసిఫాబాద్, మే 9: ఐఎఫ్ఎస్ 2022 బ్యాచ్‌కు చెందిన ఏవీఎస్ ప్రసాద్ రెడ్డిని ట్రైనీ ఆఫీసర్ గా జిల్లాకు కేటా యించారు. ఈ సం దర్భంగా గురువా రం ఆయన కలెక్ట ర్‌నుమర్యాద పూర్వ కంగా కలిసి మొక్క అంద జేశారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి: ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సురేష్‌కుమార్

ఆసిఫాబాద్, మే 9: పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్పీ సురేష్‌కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివిధ పోలీసు స్టేషన్ల వారీగా షాడో, క్రిటికల్, ఎల్‌డబ్ల్యూఈ ప్రభావిత ప్రాంతాల్లోగల పోలింగ్ స్టేషన్లలో తీసుకుంటున్న భద్రత చర్యల గురించి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలింగ్‌రోజు నుంచి 72గంటల పాటు పాటించాల్సిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎస్‌వోపీ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌హెచ్‌వోలు తమ ఏరియాలో గల క్రిటికల్, నార్మల్ పోలింగ్ స్టేషన్‌లను ప్రత్యేకంగా సందర్శించి అక్కడి పరిస్థితులను సమీక్షించాలని సూచించారు. గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్‌డేకు ముందు రోజు 48గంటల పాటు తమతమ ఏరియాలోగల వైన్‌షాప్‌లు, లేట్‌నైట్ దాబాలు క్లోజ్ చేయించాలన్నారు. ఇంటింటి ప్రచారాలు, క్యాంపేనింగ్, వెహికల్స్ తిరగకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగ్స్ ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా ఇతరప్రాంతాలకు చెందినవ్యక్తులు తమ నియోజకవర్గంలో ఉండడానికి వీలు లేదని, అందుకుగాను తమ ఏరియాలో గల రెస్టారెంట్స్, లాడ్జీలను చెక్ చేయాలన్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న సమయంలో అంతర్‌రాష్ట్ర, అంతర్ జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే ఎలాంటివి కూడా అక్రమరవాణా జరగకుండా ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన సిబ్బందికి అసౌకర్యాలు కలగకుండా అన్నిరకాల వసతులు ఏర్పాటుచేయాలని ఎస్‌హెచ్‌వోలకు సూచించారు. ఎస్సైలు, మొబైల్ రూట్ ఇన్‌చార్జిలు రూట్‌సెక్టోరల్ అధికారి మొబైల్ నెంబరు ఉంచుకోవాలన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే ఎస్సైలు నియోజకవర్గం వారీగా ఉన్న పోలీసు నోడల్ అధికారికి తెలియజేయాలన్నారు. మావోయిస్టు ప్రభావితప్రాంతాల్లో గ్రేహౌండ్స్ దళాలద్వారా డామినేషన్ నిర్వహించాలని తెలిపారు. ఆయారూట్‌లలో ఉన్నమొబైల్ పార్టీలు ఒకే చోట ఉండకుండా తమ రూట్‌లలో ఉన్న అన్ని పోలింగ్‌కేంద్రాలను అబ్జర్వ్ చేస్తూ పోలింగ్‌కేంద్రాల వద్ద ఎక్కువమంది గుమిగూడకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, సీఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'తప్పుడు ఆరోపణలు చేసినా బీజేపీ గెలుస్తుంది'

సిర్పూర్(టి), మే 9: కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎన్ని తప్పుడు ఆరోపణలు చేసినా చివరికి బీజేపీయే గెలుస్తుందని ఆపార్టీ సీనియర్ నాయకుడు, మాజీమంత్రి అమర్ సింగ్ తిలావత్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరు లతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి రాగానే రిజర్వేషన్లు రద్దు చేస్తామని కాంగ్రెస్ నాయకులు ప్రజలను ఆకర్షించేందుకు సోషల్ మీడియాలో తప్పుడు వీడియోల ద్వారా దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆయన అన్నారు. ఆదిలాబాద్ ఎంపీగా గోడం నగేష్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

5కే రన్‌ను విజయవంతం చేయండి

ఆసిఫాబాద్, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచడంలో భాగంగా ఈనెల10న నిర్వహించే 5కేరన్‌లో ప్రతిఒక్కరూ పాల్గొనాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి వెంకటేష్ దోత్రే ఒకప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజక వవర్గాలలో ఈనెల 13న నిర్వహించే ఎన్నికల్లో పోలింగ్ నమోదుశాతం పెంచడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, ఉద్యోగులు, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజురాకు బస్సు నడిపించండి



సిర్పూర్(టి)కి చేరుకున్న మహారాష్ట్ర ఆర్టీసీ బస్సు

సిర్పూర్(టి), మే 9: సిర్పూర్(టి) మండల కేంద్రం నుంచి మహారాష్ట్రలోని రాజురా వరకు తెలంగాణ ఆర్టీసీ బస్సును నడిపించాలని ప్రజలు కోరుతున్నారు. మహారాష్ట్ర రాజురా డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రాజురా నుంచి రోజువారీగా సిర్పూర్(టి) వరకు నడిపిస్తున్నారు. కాగా ఆసిఫాబాద్ డిపోనుంచి వాంకిడి మీదుగా బస్సు నడుస్తుండగా ఈ ప్రాంతానికి చెందిన వారు ఆ రూట్‌లో వెళ్లాలంటే అదనంగా 50కిలో మీటర్ల దూరం పైగా ప్రయాణించాల్సి వస్తోందన్నారు. ఆసిఫాబాద్ డిపో బస్సును సిర్పూర్(టి), మాకిడి, వీరూర్ మీదుగా రాజురాకు నడిపించినట్లయితే ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆత్మరాం నాయక్



సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఆత్మరాం నాయక్

ఆసిఫాబాద్, మే 9: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మరాం నాయక్ గురువారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పలు మండలాల్లో ఈదురుగాలులు..వర్షం



బెజ్జూరు, దహెగాంలలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు



చింతలమానేపల్లిలో రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు

బెజ్జూరు, మే 9: బెజ్జూరు మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది. మండలంలో రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై తేలిక పాటివర్షం కురుస్తుండడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు చల్లబడ్డ వాతావరణం ఉపశమనం కలిగించింది. కాగా యాసంగి పంట ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ధాన్యం తడవకుండా రైతులు టార్పాలిన్‌లు కప్పి జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

దహెగాం: మండలవ్యాప్తంగా గురువారం ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని బీభత్సం సృష్టించింది. చిరుజల్లులు స్వల్పంగా కురిశాయి. దీంతో అన్నదాతలు ఆగమాగమయ్యారు. దహెగాం, మర్రిపల్లి, కుంచవెల్లి, గరివెల్లి, తదితర గ్రామాల్లో గాలి బీభత్సానికి వరి పంట నేలకొరింగింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం రాశులు కాపాడుకోవ డానికి రైతులు టార్పాలిన్‌లు, కవర్లు కప్పడానికి తీవ్ర ఇబ్బందులుపడ్డారు. రెండు రోజులుగా వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఎండ నుంచి కొంత ఉపశమనం పొందినట్లైంది.

విరిగి పడ్డ భారీ వృక్షం

చింతలమానేపల్లి: మండలంలోని రవీంద్రనగర్-1, రవీంద్రనగర్-2 గ్రామాల మధ్య ప్రధానరోడ్డుపై భారీ వృక్షం ఈదురుగాలులకు విరిగిపడడంతో వాహనాలదారులు తీవ్రఇబ్బందులుపడ్డారు. గంటపాటు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. గ్రామస్థులు చెట్టును తొలగించడంతో గంట తరువాత యథావిధిగా రాకపోకలు సాగాయి. కాగా విషయం తెలిసినప్పటికీ సంబంధిత శాఖాధికారులు ఎవరూ స్పందించక పోవడంపై ప్రయాణికులు ఆగ్రహంవ్యక్తం చేశారు.

సిర్పూర్(యు): మండలంలోని వివిధగ్రామాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన ఓమోస్తరు వర్షం కురిసింది. పగటిపూట ఎండ దంచికొట్టగా సాయంత్రం పూట మోస్తరు వర్షంపడడంతో వాతావరణం కొంత చల్లబడింది.

సిర్పూర్(టి): మండలంలో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. కాగా ఇప్పటికే వరిపంట కోసి పంట పొలాల్లో, కొనుగోలుకేంద్రాల్లో ఉంచిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.

కెరమెరి: కెరమెరి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో గురువారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

వ్యాపారి అదృశ్యం: కేసు నమోదు

కాగజ్‌నగర్, మే 9: కాగజ్‌నగర్‌లోని ఫైనాన్స్ వ్యాపారి నాగమల్ల సురేష్ అదృశ్యంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల6న ఇంటిని నుంచి సురేష్ బయటికి వెళ్లినట్టు, రెండ్రోజులుగా తిరిగి రాలేదన్నారు. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావటంతో కుటుంబ సభ్యులు తెలిసిన ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. ఈ మేరకు అతని భార్య అన్నపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు

కాగజ్‌నగర్, మే 9: పార్లమెంటు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునే ఓటర్ల తాలుకూ జాబితాను అధికారులు సిద్ధం చేశారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలకు పంపించే జాబితాను ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏయే పోలింగ్ కేంద్రాలకు ఎంత మంది ఓటర్లు ఉన్నారో వారి జాబితాను సరి చూసుకుంటూ తుది జాబితాను సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, తహసిల్దార్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● శుక్రవారం 10 మే 2024

diksuchi@andhrajyothy.com

ప్రతి రంగంలోనూ అత్యంత అనుకూల ఆధునిక ఆవిష్కరణ 'ప్లాస్టిక్.' అదే సమయంలో అన్ని రకాల కాలుష్యాలకు 'ప్లాస్టిక్' ప్రధాన కారణం అవుతోంది. వైద్య, పారిశ్రామిక, నిత్యావసర, సరుకు రవాణా... ఇలా అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమైన ప్లాస్టిక్ నేడు మానవాళి మనుగడకే సవాలు విసురుతోంది.

తొలి 'ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టం'

ప్రపంచ దేశాల కసరత్తు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



రోజు రోజుకూ పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను భూమి పైపొర శోషించుకోలేకపోతోంది. దాంతో భూగర్భ జలమట్టాలు అడుగంటిపోతున్నాయి. నదులు, తీరప్రాంతాల నుంచి సముద్రాల్లోకి ప్లాస్టిక్ చేరుతోంది. అలల తాకిడికి, సూర్యరశ్మి ప్రభావంతో మైక్రో ప్లాస్టిక్‌గా విచ్ఛిన్నమై సముద్ర ఆవరణ వ్యవస్థ కలుషితం అవుతోంది. ఫలితంగా సముద్ర జీవుల మనుగడకు ప్రమాదం ముంచుకొస్తోంది. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలు గాలి, నీరు, మట్టి, ఆహార పదార్థాలను కలుషితం చేస్తూ మానవ, జంతు, వన్యప్రాణి ఆహార గొలుసుల్లోకి చొచ్చుకుపోతున్నాయి.

- మైక్రో ప్లాస్టిక్స్ వల్ల మానవులు క్యాన్సర్లు వంటి ప్రమాదకర రోగాల బారిన పడుతున్నారు. భూతాపం కూడా పెరుగుతోంది. ప్లాస్టిక్ తయారీ సమయంలో విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, ప్రపంచ కర్బన ఉద్గారాల్లో ప్రస్తుతం 5 శాతంగా ఉన్నాయి. ఇదేవిధంగా నియంత్రణ రహితంగా ఉన్నట్లయితే 2050 నాటికి ఇవి 20 శాతానికి చేరుకోవచ్చని అంచనా. ప్లాస్టిక్ ఉత్పత్తి 2060 నాటికి ప్రస్తుతమున్న స్థాయి కంటే మూడురెట్లు పెరుగుతుందని అంచనా. మొత్తం ప్లాస్టిక్ కాలుష్యంలో 40 శాతంగా ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అత్యధికంగా కాలుష్యానికి కారణమవుతోంది. ఓఈసీడీ(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ అండ్ కోఆపరేషన్) అంచనాల ప్రకారం వార్షిక ప్లాస్టిక్ ఉత్పత్తి ప్రపంచవ్యాప్తంగా 460 మిలియన్ టన్నులు. దీనిలో కేవలం 9 శాతం మాత్రమే ప్లాస్టిక్ రీసైక్లింగ్ జరుగుతోంది.
- ఒక ప్లాస్టిక్ వ్యర్థం భూమిలో పూర్తిగా కలిసిపోవడానికి సుమారు 20 నుంచి 500 సంవత్సరాలు పడుతుంది. ఆ ప్లాస్టిక్ మెటీరియల్, సూర్యరశ్మి తదితర వాతావరణ అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఇన్ని రకాల దుష్ప్రభావాలను చూపే ప్లాస్టిక్ ఉత్పత్తి, వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా పటిష్ఠవంతమైన నియంత్రణలు తీసుకురావాల్సిన తక్షణ అవసరం ఎంతైనా ఉంది. ఆ కోవలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు మొట్టమొదటి ప్రపంచ స్థాయి ఒప్పందాన్ని ఈ ఏడాది చివరినాటికి తీసుకువచ్చేందుకు ఏప్రిల్ మూడోవారంలో ప్రపంచ నాయకులు కెనడా రాజధాని ఒట్టావాలో సమావేశం అయ్యారు. గత ఏడాది నవంబరులో నైరోబీలో నిర్వహించిన సమావేశంలో తలెత్తిన భిన్నాభిప్రాయాలను పరిష్కరించడం, దక్షిణకొరియాలో జరగనున్న చివరి రౌండ్ చర్చల్లో ఏకాభిప్రాయం సాధించడమే ప్రధాన లక్ష్యంగా ఈ సమావేశాన్ని ఉద్దేశించారు.

అందులో భాగంగా 175 దేశాలకు చెందిన ప్రతినిధులు, పర్యావరణవేత్తలు, పారిశ్రామికరంగ ప్రతినిధులు ఒట్టావా సమావేశానికి హాజరయ్యారు.

- వాస్తవానికి 2022లో నిర్వహించిన ఐక్యరాజ్య సమితి ఎన్విరాన్‌మెంటల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న దేశాలు... ప్రపంచ ప్లాస్టిక్ కాలుష్య సంక్షోభాన్ని పరిష్కరించేందుకు 2024 చివరినాటి కల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని రూపొందించాలనే అంగీకారానికి వచ్చాయి. ఇందులో భాగంగా ఉరుగ్వే, ఫ్రాన్స్, నైరోబీ, కెనడా, దక్షిణకొరియాలో సమావేశమై 2024 చివరినాటికల్లా ఒక సమగ్ర ఒప్పందాన్ని తీసుకురావడానికి ప్రణాళిక రచించారు. అయితే పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు, వ్యాపార వర్గాలు, కొన్ని అభివృద్ధి చెందుతున్న దేశాలు ఈ ఒప్పందంలోని ఉత్పత్తి నియంత్రణ అంశాలపై కొన్ని అభ్యంతరాలను లేవనెత్తాయి. మరి కొన్ని దేశాలు మాత్రం విభిన్న ప్రణాళికలతో ముందుకు వస్తున్నాయి. సౌది అరేబియా, ఇరాన్, ఇండియా, చైనా వంటి ప్లాస్టిక్, పెట్రో కెమికల్ ఉత్పత్తిదేశాలు(ప్లాస్టిక్ పెట్రో కెమికల్స్ నుంచి ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్నాయి) 'లైక్ మైండెడ్ కంట్రీస్'గా జతకూడాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిపై విధించే ఆంక్షలపై అభ్యంతరం తెలుపుతున్నాయి. ఈ దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తి కంటే పునర్వినియోగం, రీసైక్లింగ్‌పై దృష్టిసారించాలని డిమాండ్ చేస్తున్నాయి.
- జపాన్, యురోపియన్ యూనియన్ దేశాలు; మరికొన్ని ద్వీప దేశాలను కలిగి ఉన్న 60 దేశాల 'హై యాంబిషన్ గ్రూప్' మాత్రం 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని అభిలషిస్తోంది. అమెరికా వంటి దేశాలు 2040 నాటికి ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతంచేయాలని చెబుతూనే... హై యాంబిషన్ గ్రూప్‌లా కాకుండా దేశాల వారీగా తమ సొంత ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాలని, ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన ప్రమాణాలతో తమ ప్రణాళికలను అనుసంధానపర్చుకోవాలని అభిప్రాయపడుతున్నాయి.
- ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలో ఒక ఉమ్మడి అంగీకారానికి రావడం కత్తిమీద సాము వంటి వ్యవహారమే. అయితే, అత్యధిక జనాభా ఉన్న భారతదేశంలో ఏటా 35 లక్షల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిలో కేవలం 8 శాతం మాత్రమే రీసైక్లింగ్‌కు వెళుతున్నాయి. పైగా ఇప్పటికే ప్రపంచంలో అన్ని రంగాలు ప్యాకేజింగ్, వస్తుపరమైన సౌలభ్యతల వల్ల ప్లాస్టిక్‌పై భారీగా ఆధారపడ్డాయి. ఒక్కసారిగా ప్లాస్టిక్ ఉత్పత్తిపై నియంత్రణలు విధిస్తే అవి అనేక రంగాలపై ఆర్థిక, మనుగడపరమైన సమస్యలు రేకెత్తించే అవకాశం ఉంది. కాబట్టి పలు చటి, హానికర, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విషయంలో ఉత్పత్తిపరమైన ఆంక్షలు విధించినా, మిగతా ప్లాస్టిక్ ఉత్పత్తులపై రీసైక్లింగ్, పునర్వినియోగం వంటి వ్యూహాలను పటిష్ఠంగా రూపొందించాల్సిన అవసరం ఉందని, ప్రత్యామ్నాయ వస్తువులను, అలాగే వస్తు పరిశోధనలను ప్రోత్సాహించాలని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు. ఈ అంశాలపరంగా ప్రాథమిక చర్యలు తీసుకున్న తరవాత, క్రమంగా కొత్త ప్లాస్టిక్ ఉత్పత్తులపై ఆంక్షలు విధించడం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించే దిశగా ప్రయత్నాలు సఫలం అవుతాయన్నది నిపుణుల సూచన.
- ఏది ఏమైనా, అంటార్కిటికా ఖండంలో మానవ సంచారం లేని ప్రాంతాలకు కూడా ప్లాస్టిక్ చేరుతోంది. చివరికి తల్లిపాలల్లో సైతం మైక్రో ప్లాస్టిక్ రూపంలో చేరిపోతోందన్న పరిశోధనలు కాలుష్య ఉధృతికి అద్దంపడుతున్నాయి. ఒకవైపు జలమట్టాలు అడుగంటి బెంగళూరు వంటి మహానగరాలు అల్లాడటానికి, వర్షపు నీరు భూమిలో ఇంకక ఇవే నగరాలు వరదల్లో మునిగిపోవడానికి గల కారణాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ప్రమేయం భారీగానే ఉంది. క్యాన్సర్ క్యాపిటల్‌గా భారత్ మారబోతోందన్న వార్తల్లో అతిశయోక్తి లేదు. ఈ పరిస్థితులన్నీ ప్రపంచవ్యాప్తంగా ఒక పటిష్ఠవంతమైన ప్లాస్టిక్ కాలుష్య నివారణ చట్టాన్ని తీసుకురావాల్సిన తక్షణ అవసరాన్ని చాటిచెబుతున్నాయి.

ఒట్టావా సమావేశం

కెనడా రాజధాని ఒట్టావాలో ఏప్రిల్ 23 నుంచి 29 వరకు 'ఇంటర్ గవర్నమెంటల్ నెగోషియేటింగ్ కమిటీ' 4వ సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నివారణ, ప్లాస్టిక్ ఉత్పత్తిపై నిషేధం విధించడానికి ప్రపంచదేశాలకు ఒక నిర్ణీత కాలపరిమితితో కూడిన లీగల్లీ బైండింగ్(చట్టబద్ధ) గడువుపై ఏకాభిప్రాయం సాధించడం ఈ సమావేశం ప్రధాన లక్ష్యం.

- అయితే 'హై-యాంబిషన్ గ్రూప్' దేశాలు ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయడం ద్వారా మాత్రమే కాలుష్యాన్ని నివారించగలమని, కాబట్టి ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసేందుకు దేశాలకు లీగల్లీ బైండింగ్ గడువు నిర్ణయించాలని వాదించాయి. కాగా, 'లైక్ మైండెడ్ దేశాలు'గా వ్యవహరిస్తున్న పెట్రో కెమికల్స్ ఉత్పత్తి దేశాలు మాత్రం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ ఉత్పత్తి నిషేధాన్ని వ్యతిరేకించాయి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలు పూర్తిస్థాయిలో ఇంకా అభివృద్ధి కానందున వాటి ఉత్పత్తిపై పూర్తి నిషేధం నిర్హేతుకమని వాదిస్తున్నాయి.
- రెండు గ్రూపుల దేశాల మధ్య ఏకాభిప్రాయం కుదరనందున ఈ సమావేశం ప్రధానలక్ష్యం పరంగా ముందడుగు పడలేదు. అయితే ప్లాస్టిక్ సంబంధిత ఉద్గారాలు, ఉత్పత్తి, వ్యర్థాల నిర్వహణ, సమస్యాత్మక, నివారించదగ్గ ప్లాస్టిక్ రకాలు వంటి వాటిపై(సవివర అంచనాలతో(డీటైల్డ్ అసెస్‌మెంట్స్) ముందుకు రావడానికి అన్ని దేశాలు అంగీకరించడం కొసమెరుపు.
- ఈ ఏడాది నవంబరులో దక్షిణకొరియాలోని బుసాన్‌లో ప్లాస్టిక్ కాలుష్య నివారణ కోసం 5వ, చివరి సంప్రదింపుల సమావేశం జరగనుంది. ఇప్పటివరకు నిర్వహించిన నాలుగు సమావేశాల్లో కుదరని ఏకాభిప్రాయం ఈ చివరి సమావేశంలోనైనా సాధిస్తేనే ప్లాస్టిక్ కాలుష్య నివారణ ఒప్పందం సాకారమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

టీఎస్ సెట్ - 2024

జాబ్ కార్నర్

తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష(టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్‌ను ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసింది. రాష్ట్రంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్ నియామకాలకు అర్హత సాధించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు.

సబ్జెక్టులు: జనరల్ పేపర్ ఆన్ టీచింగ్ అండ్ రీసెర్చ్ ఆప్టిట్యూడ్(పేపర్-1), జాగ్రఫీ, కెమికల్ సైన్సెస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఎర్త్ సైన్స్, లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, తెలుగు, ఉర్దూ, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, సంస్కృతం, సోషల్ వర్క్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, లింగ్విస్టిక్స్.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ(ఎంఏ, ఎమ్మెస్సీ), ఎంకాం, ఎంబీఏ, ఎంఎల్ఐఎస్సీ, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎంసీజే, ఎల్ఎల్ఎం, ఎంసీఏ, ఎంటెక్(సీఎస్ఈ, ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: గరిష్ఠ వయోపరిమితి లేదు

పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(సీబీటీ) పద్ధతిలో జరిగే పరీక్షకు రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్ష వ్యవధి మూడు గంటలు.

పరీక్ష ఫీజు: ఓసీలకు రూ.2000. బీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ, వీహెచ్, హెచ్ఐ, ఓహెచ్, ట్రాన్స్‌జెండర్‌లకు రూ.1000.

పరీక్ష కేంద్రాలు: ఆదిలాబాద్, నిజామాబాద్, విజయవాడ, హైదరాబాద్, వరంగల్, కర్నూలు, కరీంనగర్, ఖమ్మం, తిరుపతి, మహబూబ్‌నగర్, వైజాగ్, నల్లగొండ

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం: మే 14 **చివరి తేదీ:** జూలై 2

పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 28 నుంచి 31 వరకు

వెబ్‌సైట్: http://telanganaset.org/index.html



నలంద యూనివర్సిటీలో మాస్టర్స్

న్యూఢిల్లీలోని నలంద యూనివర్సిటీ - మాస్టర్స్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎంబీఏలో ఏడాది కోర్సు పూర్తిచేసిన తరవాత డిప్లొమాతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది. అభ్యర్థులకు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం తప్పనిసరి.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** హిందూ స్టడీస్(సనాతన), వరల్డ్ లిటరేచర్, హిస్టారికల్ స్టడీస్, బుద్ధిస్ట్ స్టడీస్-ఫిలాసఫీ అండ్ కంపారిటివ్ రెలీజియన్స్
- **ఎంబీఏ స్పెషలైజేషన్:** సస్టయినబుల్ డెవలప్‌మెంట్ అండ్ మేనేజ్‌మెంట్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్:** ఎకాలజీ అండ్ ఎన్విరాన్‌మెంట్ స్టడీస్

అర్హత వివరాలు: హ్యూమానిటీస్/సైన్సెస్/ఇంజనీరింగ్/మేనేజ్‌మెంట్/లా విభాగాల్లో కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ/తత్సమాన కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఎంబీఏ కోర్సుకు క్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్‌లో కనీసం 70 శాతం స్కోర్ సాధించి ఉండాలి. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు అయిదేళ్ల అనుభవం ఉంటే చాలు. ఏ కోర్సులో ప్రవేశానికైనా అభ్యర్థులు కనీసం 250 పదాలతో సెల్ఫ్ ఇంట్రడక్షన్/బయో-నోట్ స్టేట్‌మెంట్ సబ్మిట్ చేయాలి. స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్ కింద ఈ యూనివర్సిటీలో చేరడానికి గల కారణాన్ని 100 పదాల్లో; ప్రోగ్రామ్‌ని ఎంచుకోవడానికిగల కారణాన్ని 300-500 పదాల్లో రాసి పంపాలి. విదేశీ (నాన్ ఇంగ్లీష్ కంట్రీస్) అభ్యర్థులు ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ ప్రూఫ్ కింద టోఫెల్/ఐఈఎల్‌టీఎస్ స్కోర్ కార్డ్ సబ్మిట్ చేయాలి.

ఎంపిక: స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, సెల్ఫ్ ఇంట్రడక్టరీ నోట్, అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. విదేశీ అభ్యర్థులకు ఆన్‌లైన్/పర్సనల్ ఇంటర్వ్యూ కూడా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** nalandauniv.edu.in



ఏపీ ఆర్‌జీయూకేటీ అడ్మిషన్స్

ఆంధ్రప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్‌కే వ్యాలీ, నూజివీడు, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఈ ప్రోగ్రామ్‌ని నిర్వహిస్తున్నారు. ఇందులో మొదట రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సు(పీయూసీ) తరవాత నాలుగేళ్ల బీటెక్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 80 క్రెడిట్స్ నిర్దేశించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, కౌన్సెలింగ్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

పీయూసీ సబ్జెక్టులు: మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, తెలుగు/హిందీ/సంస్కృతం/ఫారిన్ లాంగ్వేజ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయాలజీ

బీటెక్ విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్.

సీట్ల వివరాలు: ఒక్కో క్యాంపస్‌లో 1000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థుల కోసం ప్రతి క్యాంపస్‌లో అదనంగా 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు.

అర్హత వివరాలు: ఈ ఏడాది ఏపీ/టీఎస్ ప్రభుత్వం నిర్వహించిన పదోతరగతి పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 4 శాతం వెయిటేజీ ఉంటుంది. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే.

ముఖ్య సమాచారం

- **ట్యూషన్ ఫీజు:** పీయూసీ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.45,000; బీటెక్ ప్రోగ్రామ్‌నకు ఏడాదికి రూ.50,000 చెల్లించాలి. తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులు ట్యూషన్ ఫీజు కింద ఏడాదికి రూ.1,50,000లు చెల్లించాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 25
- **స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** జూలై 1 నుంచి 6 వరకు
- **అభ్యర్థుల సెలెక్షన్ లిస్ట్ విడుదల:** జూలై 11
- **జనరల్ అభ్యర్థుల డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లకు ఎంపికైన వారికి జూలై 22, 23; ఒంగోలు క్యాంపస్‌కు ఎంపికైనవారికి జూలై 24, 25; శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైన వారికి జూలై 26, 27
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ వేదికలు:** నూజివీడు, ఆర్‌కే వ్యాలీ, శ్రీకాకుళం క్యాంపస్‌లు
- **వెబ్‌సైట్:** www.rgukt.in

లిటిల్స్



కొడుకులకు పరీక్ష పెట్టిన నాన్న!

సోమయ్య అనే వ్యక్తి ఉండేవాడు. కష్టపడి పని చేసేవాడు. పండిన పంటను అమ్మి తన కుటుంబాన్ని పోషించేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వారంతా సోమరులు. ఏ పని చేసేవాళ్లు కాదు. నాన్న కాయా కష్టం మీద బతికేవాళ్లు. అది అతనికి నచ్చేది కాదు. ఎలాగైనా పిల్లలను ప్రయోజకుల్ని చేయాలని కలగనేవాడు. అయితే వారు మాత్రం సోమరులుగానే ఉండేవాళ్లు.

ఆ రైతుకు జబ్బు చేసింది. వయసుపైబడింది. దీంతో మంచానికే పరిమితమయ్యాడు. ఒక రోజు తన నలుగురు కొడుకులను పిలిచాడు. 'ఇక నా పని అయిపోతోంది. చేసినన్ని రోజులు కష్టపడ్డాను. ఇక ఓపిక లేదు. మీరు ఎలా బతుకుతారో ఏమో' అన్నాడు. నలుగురు కొడుకులు కిందకి తల దించుకుని ఉన్నారు. 'ఓరి బడవల్లారా.. మీకో విషయం చెబుతా. బాగుపడండి. మన చేనులో ఓ కుండ ఉంది. అందులో బంగారు నాణేలు ఉన్నాయి' అన్నాడు. అందరి ముఖాలు వెలిగిపోయాయి. 'నేను ఆ బంగారు నాణేలను కుండలో ఎక్కడ పూడ్చిపెట్టానో మర్చిపోయా. చేనును తవ్వి తీసుకోండి' అన్నాడు. ఆ మాటలు వినగానే కష్టజీవుల్లా అందరూ చేనుకు పయనమయ్యారు. మట్టిలో వెతకటం ప్రారంభించారు. రెండు రోజుల పాటు వెతికి ఆయాసంతో తండ్రి దగ్గరకు వచ్చారు.

రైతు విషయం తెలుసుకున్నాడు. అవునా! అయితే ఓ పని చేయండి. ఎలాగూ మట్టిని తవ్వారు కాబట్టి మీరు విత్తనాలు చల్లండి అన్నాడు. ఆ కొడుకులు వెంటనే సంతకు పోయి మంచి విత్తనాలు తీసుకొచ్చారు. అదృష్టవశాత్తూ వానపడింది. పదును అయిన నేలలో విత్తనాలను చల్లేసరికి పంట మొలకెత్తింది. ఇంకో వాన పడటంతో పంట బాగా పండింది. కొంత ధాన్యం ఇంట్లోకి తీసుకుని మిగతాది సంతలో అమ్ముకొచ్చారు. మంచి లాభం వచ్చింది. ఈ విషయం తండ్రి దగ్గరకు వచ్చి చెప్పారు. 'మీరు కష్టపడండి. చేనులో కుండలేదు. అసలు బంగారం లేనే లేదు. మీరు కష్టపడి పని చేస్తే ఇలా చేను పండుతుంది. బంగారం లాంటి ధాన్యం మీ చేతులోకి వస్తుంది. మీ కాళ్లమీద మీరు నిలదొక్కుకుంటారు' అంటూ రైతు చెప్పాడు. పిల్లలకు విషయం అర్థమైంది. సిగ్గుపడ్డారు. ఆ రోజు నుంచి తండ్రిమాట జవదాటకుండా కష్టపడ్డారు.

సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 303

	8				4	9		
	7		9			8		
5		3						
	1			3		4		8
3				2				6
8		4		7			3	
						3		9
		8			7		2	
		6	8				5	

సుడోకు - 302 సమాధానం

8	2	5	3	9	4	1	7	6
9	6	7	2	1	8	5	3	4
4	1	3	5	7	6	2	9	8
7	3	1	8	2	9	6	4	5
2	9	4	7	6	5	8	1	3
5	8	6	1	4	3	9	2	7
6	4	8	9	3	2	7	5	1
1	5	2	4	8	7	3	6	9
3	7	9	6	5	1	4	8	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.